

మూసీ పరీవాహక ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

భయం వద్దు.. నిశ్చింతగా ఉండండి

ప్రజలకు నష్టం జరగకుండా చూస్తా

● మూసీ పరీవాహక ప్రాంత ప్రజలతో మధుయాష్కీగౌడ్

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, స్థానికులకు తాను అండగా ఉంటానని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ భరోసా ఇచ్చారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని సాయిబాబా ఆలయం వద్ద మూసీ పరీవాహక ప్రాంతవాసులతో మధుయాష్కీగౌడ్ సమావేశమయ్యారు. స్థానికులు మాట్లాడుతూ తాము ఇళ్ల కోల్పోతామేమోనని ఆందోళనను వ్యక్తం చేశారు. మధుయాష్కీ స్పందిస్తూ.. ఎవరూ భయపడవద్దని వారి చేతిలో చేయి వేసి ధైర్యం చెప్పారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణలో భాగంగా మూసీ నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం అన్నివిధాలుగా ఆలోచిస్తుందన్నారు. మూసీ సుందరకరణ విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా ఆలోచిస్తుందన్నారు. నగరం లోపల మూసీ వేరని, చైతన్యపురి, కొత్తపేట, నాగోల్ లాంటి శివారు ప్రాంతంలో వేరని పేర్కొన్నారు. చైతన్యపురి, కొత్తపేట, నాగోల్ ప్రాంతాలలో మూసీ చాలా విశాలంగా ఉందన్నారు. ఇళ్లు కోల్పోకుండా.. ఇళ్లులేని వైపు ఎక్కువగా భూసేకరణ చేసే విధంగా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. ప్రజల సందేహాల నివృత్తికి ఇక్కడి ప్రాంత వాసులను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్దకు తానే తీసుకెళ్లి మాట్లాడిస్తానని స్పష్టంచేశారు. ప్రజలతో చర్చించకుండా, ఎవరి ఇళ్లు అన్యాయంగా కూల్చరు అని ఆయన పేర్కొన్నారు. మాజీమంత్రి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఈ ప్రాంత చెరువులు, కుంటలు మింగేశారని మండిపడ్డారు. కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని హెచ్చరించారు. చెరువులను చెరబట్టిన అక్రమార్కులపై విచారణ జరిపించడం ఖాయమన్నారు.



చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి డ్రాగన్ ఫ్రూట్‌లను అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, రైతులు

డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

● మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమాఖ్య అధ్యక్షుడు, జాతీయ హార్టికల్చర్ బోర్డు మెంబర్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు బాటసింగారం పండ్ల మార్కెట్‌లో చైర్మన్ మధుసూదన్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్ రైతులు పలు సమస్యలను చైర్మన్‌కు వివరించారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి చైర్మన్‌ని కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లపై మట్టిని తొలగించాలి

కొత్తపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని న్యూమారుతీనగర్, నాగేశ్వర్‌నగర్‌కాలనీ, సత్యానగర్, వైష్ణవీనగర్‌కాలనీల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లపై మట్టిని సత్వరమే తొలగించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి నూతన సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సీసీ రోడ్లు ప్రజల వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ మాతృనాయక్, సత్యానగర్ ప్రధాన కార్యదర్శి టీవీ.రమణ, నాయకులు మంచి రాజేష్, తోట మహేందర్‌యాదవ్, గట్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ

మన్సూరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలను ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా తీసుకుని అభాగ్యులకు అండగా నిలవాలని స్వాస్ ఫౌండేషన్ ఫౌండర్ ఆరా పటేల్ పేర్కొన్నారు. నాగోల్‌లోని అమ్మాజ్యోతి అనాథాశ్రమ పిల్లలకు సోమవారం స్వాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరా పటేల్ మాట్లాడుతూ దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సేవతో పాటు మొక్కలు నాటడం, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు తమ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తూ వస్తున్నామని, అనాథ విద్యార్థుల్లో ఒక్కొక్కరిలో ఉన్న ప్రతిభను బట్టి వారికి తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదే కీలకం: అందెల

సరూర్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదే కీలకమని, సభ్యత్వం ఎంత పెరిగితే పార్టీ అంత బలంగా తయారవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట్‌లో యువమోర్చా అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురి చేత సభ్యత్వం చేయించి గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ సభ్యత్వ నమోదు కన్వీనర్ నడికుడ యాదగిరి, పార్టీ అధ్యక్షుడు సీహెచ్ వెంకట్‌రెడ్డి, పార్టీ నాయకులు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, రేసు నర్సింహారెడ్డి, బెల్ల రాజు, చిత్రం శ్రీనివాస్, కందికంటి శ్రీనివాస్‌గౌడ్, సాయిసంతోష్, సతీశ్‌నందా, సాహిల్, శరత్‌చంద్ర, మల్లేశ్ పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి

హయత్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కబడ్డీ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా హయత్‌నగర్‌కు చెందిన పిసాటి సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హయత్‌నగర్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సుధాకర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కబడ్డీ ఆటకు మరింత ప్రాధాన్యత దక్కే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనకు సహకరించిన తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు సుధీర్‌రెడ్డి, ఒలంపిక్ సంఘం రాష్ట్ర సెక్రటరీ జగదీశ్వర్‌యాదవ్, రాష్ట్ర నాయకులు రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, చంద్రమోహన్‌గౌడ్, లింగంగౌడ్, రాజుగౌడ్, ఉదయ్‌కుమార్, సంఘీ జంగం, తాడిచెట్టు సునీల్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ఎర్ర వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, సుధాకిషోర్, వేణుగౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలి

చాదర్‌ఘాట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని, అందుకు అవసరమైతే ఉద్యమానికి కూడా వెనుకాడబోమని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. సోమవారం మలక్‌పేట కళ్యాణ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 106 కోర్టుల్లో సుమారు 39వేల మంది న్యాయవాదులు న్యాయం కోసం నిరంతరం పనిచేస్తున్నారని, అలాంటి వారికి రక్షణలేని కారణంగా కొన్ని సందర్భాల్లో జరిగిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై రోజురోజుకు దాడులు మితిమీరిపోతున్నందున వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టం తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక చట్టం ద్వారానే న్యాయవాదులకు రక్షణ లభిస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. అందుకు న్యాయవాదులందరు ఈ డిమాండ్ సాధనకు సమష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్



కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరీ మందిరంలో సామూహిక కుంకుమార్చనలో భక్తులు



న్యూ మారుతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో దుర్గామాతను దర్శించుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న హనుమాన్ ఆలయ తాజా మాజీ చైర్మన్ రఘుమారెడ్డి



టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ శ్రీనివాస్‌గుప్తాకు జ్ఞాపికను అందజేస్తున్న నాగోల్ మమతానగర్‌లోని మండప నిర్వాహకులు

ఘనంగా నవరాత్రి మహోత్సవాలు

సరూర్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నయనానందకరంగా జరుగుతున్నాయి. నిర్వాహకులు మండపాల్లోని అమ్మవారి విగ్రహాలకు నిత్య పూజలు నిర్వహిస్తూ భక్తితో కొలుస్తున్నారు. నాదర్‌గుల్‌లో కొలువుదీరిన దుర్గామాతను మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సునీతాశ్రీకాంత్‌గౌడ్, తోట శ్రీధర్‌రెడ్డి, జి.ఇంద్రసేన తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీరామ ఎన్‌క్లేవ్‌లో కుంకుమార్చన

నాదర్‌గుల్ 8వ డివిజన్‌లోని శ్రీరామ ఎన్‌క్లేవ్-4లో పురోహితుడు శ్యాం సుందర్‌శర్మ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మహిళలు అమ్మవారిచెంత సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

ప్రశాంతిహిల్స్‌లో

మీర్‌పేట్ కార్పొరేషన్ ప్రశాంతిహిల్స్ ఫేజ్-2లో ప్రతిష్ఠించిన అమ్మవారికి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ప్రజలంతా సంతోషంగా జీవించాలి : మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తెలిపారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్కేడినగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గమాత మండపంలో మధుయాష్కీగౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండప నిర్వాహకులు శ్రావణ్‌రెడ్డి, త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ కొత్త శ్రీధర్‌గౌడ్, ఉమేష్‌గౌడ్, నాయకులు సదాశివుడు, కుట్ల నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హరిహరపురంలో..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హరిహరపురం కాలనీలోని త్రిశక్తి ఆలయంలో దేవీశరన్నవరాత్రి వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం మహాసరస్వతిదేవి అన్నపూర్ణదేవి, మహాదుర్గా అమ్మవారు కాత్యాయనిదేవి, మహాలక్ష్మీదేవి ధాన్యలక్ష్మి అమ్మవారుగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డి.విజయ భాస్కర్, ఆలయ ట్రస్టీ నారాయణరెడ్డి, రాయుడు ఈశ్వరరావు, వెంకటయ్య, రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆల యం కమిటీ ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారు సోమవారం భక్తులకు మహాచండీగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

నాగోల్ డివిజన్ మమతానగర్‌లో..

నాగోల్ డివిజన్ మమతానగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సోమవారం సందర్శించిన టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాగేందర్‌గౌడ్, ప్రవీణ్‌గుప్తా, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేటలో కార్పొరేటర్ పవన్‌కుమార్ న్యూ మారుతీనగర్ కమ్యూనిటీహాల్‌లో, నాగేశ్వర్‌నగర్‌కాలనీలో దుర్గాదేవిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. నాయకులు నీరంకి రవి, రామ్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీపోచమ్మ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ తాజా మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయం మాజీ డైరెక్టర్లు చేగోని మల్లేష్‌గౌడ్, చీర తిరుమలేష్, మాజీ ఏరియా కమిటీ సభ్యుడు జగదీష్‌గౌడ్, భక్తులు జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో..

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఉత్సవాలను పురస్కరించుకొని సరస్వతిదేవి ఆలయంలో సోమవారం లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత ఆలయంలో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

సైదాబాద్, మాదన్నపేటలలో..

సైదాబాద్ : సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేటలలో అమ్మవారి ఆలయాలు, మండపాలు భక్తుల రాకతో పోటెత్తుతున్నాయి. సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గామాత, జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కుర్మబస్తీలోని శివాంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మాతాజాగరణ్ కార్యక్రమం భక్తిపారవశ్యంతో కొనసాగింది.



ఉత్సవాల్లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తదితరులు



కుర్మబస్తీలో అమ్మవారిని దర్శించుకుంటున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, హరిగౌడ్ తదితరులు



నాదర్‌గుల్‌లో దుర్గమ్మ పూజలో మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, కార్పొరేటర్ సునీతాశ్రీకాంత్‌గౌడ్ తదితరులు

ఆలయాలకు మదర్‌డెయిరీ నెయ్యి, పాలు అందజేస్తాం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీ నెయ్యి, పాలు దేవాలయాలు, విద్యాసంస్థలకు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం హయత్‌నగర్ మదర్‌డెయిరీ కార్యాలయంలో జరిగిన చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్యతో కలిసి నూతన చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మిఠాయి తినిపించి కూర్చిలో కుర్చోబెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న మదర్‌డెయిరీని లాభాల్లో తీసుకురావడానికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. ఉద్యోగులు, కార్మికులు కలిసికట్టుగా పని చేస్తే మదర్‌డెయిరీ లాభాల బాటలో పయనిస్తుందన్నారు. మదర్‌డెయిరీ ఉత్పత్తులు నాణ్యతకు మరోపేరు అని అన్నారు. తెలంగాణాలోని దేవాలయాలు, ప్రభుత్వ విద్యాసంస్థలకు పాలు, నెయ్యి సరఫరా చేస్తామన్నారు. మదర్ డెయిరీ విషయంపై మరో మారు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని తెలిపారు. చైర్మన్, పాలకవర్గం సభ్యులు కష్టపడి రైతులకు మేలు జరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, మదర్‌డెయిరీ ఎండీ కృష్ణ, పాలకవర్గం సభ్యులు జయశ్రీ, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, జలేందర్‌రెడ్డి, అలివేలు, శ్రీధర్‌రెడ్డి, పాండు, రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహులు, జంగయ్య, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మదర్ డెయిరీ నూతన చైర్మన్ మధుసూదన్‌రెడ్డిని కుర్చిలో కూర్చోబెడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే ఐలయ్య

మన్సూరాబాద్ -పోచంపల్లి రోడ్డు తెరిపించే బాధ్యత నాది

● ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారిపైన ఉన్న ట్రాఫిక్‌ను అధిగమించేందుకు పోచంపల్లి- మన్సూరాబాద్ వరకు ఉన్న పాత రోడ్డు తెరిపించే బాధ్యత నాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి క్రీడా అధికారులు శ్రీసాయినగర్‌కాలనీ వద్ద మూసివేసిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గతంలో ఉన్న పాత రోడ్డు మ్యాపును ఈటలకు చూపించారు. రోడ్డును మూసి వేయడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను, ట్రాఫిక్ సమస్యలను ఎంపీకి వివరించారు. దాదాపు వంద సంవత్సరాలుగా ఉన్న రోడ్డును కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా) ఏర్పాటుతో అధికారులు రోడ్డుకు అడ్డంగా గోడను కట్టి మూసివేశారని తెలిపారు. ప్రజలకు కలుగుతున్న అసౌకర్యంపై దాదాపు 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని నర్సింహారెడ్డి ఎంపీకి వివరించారు. అయినా అధికారులు స్పందించడం లేదని అన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ నగరానికి దూరాన్ని తగ్గించేదిగా ఉన్న మన్సూరాబాద్- పోచంపల్లి రోడ్డును కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తెరిపించడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నా రు. ఈ రోడ్డును తెరిపించడం వల్ల విజయవాడ జాతీయ రహదారిపైన ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. ఫోన్‌లో ఫారెస్టు అధికారులతో మాట్లాడారు. పాత రోడ్డును వదిలి రోడ్డుకు ఇరువైపుల గోడ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్‌రెడ్డితో పాటు పలువురు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



మన్సూరాబాద్ - పోచంపల్లికి ఉన్న పాత రోడ్డు మ్యాపును పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

అభివృద్ధి వైపు అడుగులు వేయాలి

దిల్‌సుఖ్‌నగర్ : కాలనీవాసులంతా ఐక్యమత్యంతో సమస్యలపై పోరాటం చేసినప్పుడే కాలనీలు త్వరగా అభివృద్ధి చెందుతాయని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాలనీ 50 ఏళ్ల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు లోతట్టున ఉన్నటువంటి పీ అండ్ టీ కాలనీ తరచు ఇబ్బందులు పడుతున్న వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపుతానని హామీనిచ్చారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారుల కలయికతో ఏర్పడిన పీ అండ్ టీ కాలనీ యాభై వసంతాల వేడుక జరుపుకోవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి సుభద్రదేవి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండి నిర్మల, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మున్నంగి అశోక్ కుమార్, వేణుగోపాల్, మున్నాయాదవ్ పాల్గొన్నారు.

24గంటలు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండేలా చూడండి

హయత్‌నగర్: అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డ్యూటీ డాక్టర్లు 24గంటల పాటు అందుబాటులో ఉండేలా చూడాలని డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన హయత్‌నగర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న చికిత్సల గురించి, ల్యాబ్ సర్వీస్, ఫార్మసీ, లేబర్‌రూం, వార్డు రూంలను, క్యాజువాలిటీలను ఆయన పరిశీలించారు. డాక్టర్లు లక్ష్మీనర్సింహ, తిరుపతిరెడ్డి, దుర్గా, పురుషోత్తం పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు

చంపాపేట : ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం రాత్రి కంచన్‌బాగ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పద్మయ్య కథనం ప్రకారం కంచన్‌బాగ్‌లోని హాఫీజ్‌బాబానగర్‌లోని బి బ్లాక్‌లో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ ఎండీ నవాజ్(35) ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు ఇంటిపై దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నారు. ఇంటియజమాని ఎండీ నవాజ్‌తో పాటు బండ్లగూడకు చెందిన కారు డ్రైవర్ ఎండీ కలీం(39), ఎండీ దస్తగిరి(26), ఎండీ సలీం(28), పేయింటర్ ఎండీ యూసూఫ్(39)లను పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.5900 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

మీర్‌పేట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

● లిఫ్ట్ అడిగిన వ్యక్తి.. లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి.. ఇద్దరూ దుర్మరణం

సరూర్‌నగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలోని నందనవనం సమీపంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వారి లో ఒకరు లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి కాగా, మరొకరు లిఫ్ట్ అడిగిన వ్యక్తి కావడం గమనార్హం. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్‌కు చెందిన షేక్ మదీనాభాష(42) మీర్‌పేట్‌లోని టీకేఆర్ కాలేజీ సమీపంలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తూ ఉప్పల్ పీర్జాదిగూడలో గల టీజీఎస్ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం ఏడుగంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై పీర్జాదిగూడ వర్క్‌షాప్‌కు బయలుదేరారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని దర్పల్లి గ్రామానికి చెందిన అన్నోజు శ్రావణ్‌కుమార్(40) మీర్‌పేట్ నందనవనం సమీపంలోని బస్తీలో నివసిస్తూ టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 6గంటలకు డ్యూటీకి వచ్చిన శ్రావణ్‌కుమార్.. సోమవారం ఉదయం డ్యూటీ దిగి ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై పీర్జాదీగూడకు వెళ్తున్న భాషాను లిఫ్ట్ అడగడంతో ఆయన శ్రావణ్‌ను కూర్చుండబెట్టుకుని టీకేఆర్ కమాన్ వైపు బయలుదేరారు. కర్మన్‌ఘాట్ శ్మశానవాటిక(హస్తినాపురం జడ్పీ రోడ్డు చౌరస్తా) వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దాంతో వారిద్దరూ కింద పడిపోగా, లారీ వారీ మీద నుంచి వెళ్లడంతో శరీరాలు నుజ్జునుజ్జై అక్కడికక్కడే ఇద్దరూ దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రావణ్‌కుమార్ (ఫైల్)



కుటుంబ సభ్యులతో భాషా(ఫైల్)



ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి

దసరా పండుగకు ఊరికి వెళ్లే వారు పోలీసుల సూచనలు పాటించాలి : ఇన్‌స్పెక్టర్

వనస్థలిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు ఊరికి వెళ్లే వారు పోలీసుల సూచనలు పాటించి, దొంగతనాల నివారణకు సహకరించాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. దసరా పండుగకు ఊరికి వెళ్లే ప్రజలు పోలీసుల సూచనలు పాటిస్తూ, దొంగతనాల నివారణకు సహకరించాలని కోరుతూ వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి సోమవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వద్ద ప్రచార ఆటోను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఏడుకొండలు, అనిల్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.